# సాక్షి
## శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 30 । జూలై । 2023




### ఆర్బీకేలకు మందుల సరఫరా

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని మూగజీవాలకు అత్యవసర మందులను ఆర్బీకేలకు సరఫరా చేస్తున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మహేశ్వరుడు పేర్కొన్నారు.



### బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రాములు) | రూ.61,430 |
| 22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా) | రూ.5,517 |
| మూడు శాతం జీఎస్టీతో | రూ.5,683 |
| సవర (8 గ్రాములు) | రూ.45,464 |

గరిష్టం/కనిష్టం
35.7 /28.5

### వాతావరణం

వాతావరణంలో తేమ 46 శాతంగా ఉంది. జిల్లావ్యాప్తంగా వాతావరణం ఆదివారం పొడిగా ఉండేందుకు అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



స్వర్ణాల చెరువు వద్ద కోలాహలం

# మురిసిన స్వర్ణాల

## వరాల రొట్టెల పండగ ప్రారంభం



- లక్షలాది మంది భక్తులతో బారాషహీద్ దర్గా కిటకిట
- పక్కాగా ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: మత సామరస్యానికి వేదికగా నిలిచే రొట్టెల పండగ నగరంలోని స్వర్ణాల చెరువులో కోలాహలంగా శనివారం ప్రారంభమైంది. ఉద్యోగ.. వివాహ.. సంతాన.. ఆరోగ్య.. సౌభాగ్య.. విదేశీయానం.. ఉద్యోగం.. ఇలా తమ కోర్కెలు నెరవేరాలని కాంక్షిస్తూ భక్తులు స్వర్ణాల చెరువు వద్దకు పోటెత్తారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, తదితర ప్రాంతాల నుంచి భారీగా హాజరయ్యారు. చెరువులో పుణ్యస్నానాలు ఆచరించి రొట్టెలను మార్చుకున్నారు. అనంతరం బారాషహీదుల సమాధులను దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. రొట్టెలు పట్టుకునే క్రమంలో భక్తులు ఇబ్బంది పడకుండా ఎక్కడ ఏ రొట్టె లభిస్తుందనే వివరాలపై నగరపాలక సంస్థ అధికారులు బోర్డులను ఏర్పాటు చేశారు.

### గంధమహోత్సవం నేడు

రొట్టెల పండగలో అత్యంత కీలకమైన గంధ మహోత్సవాన్ని ఆదివారం రాత్రి నిర్వహించనున్నారు. కోటమిట్ట అమీనియా మసీదు నుంచి 12 గంధపు బిందెలతో ఊరేగింపుగా దర్గాకు చేరనుంది. ఫకీర్ల విన్యాసాల నడుమ గంధాన్ని దర్గాకు తీసుకురానున్నారు. అక్కడ కడప పీఠాధిపతి ప్రత్యేక ప్రార్థనలు చేసి గంధాన్ని సమాధులకు పూసి భక్తులకు పంచనున్నారు.

### భక్తిశ్రద్ధలతో షహదత్, సొందల్‌మాలి

నెల్లూరు(బృందావనం): రొట్టెల పండగ సందర్భంగా బారాషహీదులను స్మరిస్తూ వారి సమాధుల చెంత షహదత్‌ను స్థానిక మతపెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు. వీరుల సమాధులను శనివారం రాత్రి 11.30 నుంచి తెల్లవారుజామున రెండు గంటల వరకు గులాములు, పన్నీరుతో శుభ్రం చేసి అనంతరం గంధంతో లేపనం చేశారు. తదుపరి చద్దర్లు కప్పి సొందల్ మాలిని నిర్వహించారు.



క్యూలో భక్తజనం



రొట్టెను మార్చుకుంటూ..



బారాషహీదుల సమాధులను దర్శించుకుంటూ..




సేదతీరుతున్న భక్తులు



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ హరినారాయణన్




ఏ రొట్టె ఎక్కడ లభ్యమవుతుందో తెలియజేసేలా ఏర్పాటు చేసిన బోర్డులు



విద్యుద్దీపాలతో శోభాయమానంగా దర్గా ప్రాంగణం

## నిఘా నీడన..



కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి దర్గా పరిసరాలను పరిశీలిస్తున్న తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): బారాషహీద్ దర్గాలో నిఘా నీడన రొట్టెల పండగ శనివారం ప్రారంభమైంది. వివిధ జిల్లాలకు చెందిన 2500 మంది సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారు. మహిళల రక్షణ నిమిత్తం స్వర్ణాల చెరువు ఘాట్, దర్గాలో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. దర్గా ఆవరణలో 50 సీసీ కెమెరాలు, రెండు డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేసి, వాటిని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానించారు. దర్గాలో తప్పిపోయిన సుమారు 34 మంది చిన్నారులను సంరక్షించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. కర్ణాటకకు చెందిన ఓ మహిళ హ్యాండ్‌బ్యాగ్‌ను చోరీ చేసిన గుంతకల్లుకు చెందిన వ్యక్తిని బాధితులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఫిన్స్ సాయంతో నిందితుడి వేలిముద్రలను సీసీఎస్ డీఎస్పీ శివాజీరాజా పరిశీలించారు. అనంతరం నిందితుడ్ని దర్గామిట్ట పోలీసులకు అప్పగించారు. ట్రాఫిక్‌కు అంతరాయం తలెత్తకుండా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. దర్గాలో బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, ఏఎస్పీ హిమవతి పరిశీలించారు. బందోబస్తు విధుల్లో ఉన్న సిబ్బందికి కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఎస్పీ పలు సూచనలు చేశారు.

### క్షుణ్ణంగా తనిఖీలు

దర్గా ప్రధాన గేట్ వద్ద మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేసి భక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే లోపలికి అనుమతిస్తున్నారు. డాగ్, బాంబ్‌స్క్వాడ్లు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నాయి. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వీఐపీల వాహనాల మినహా మిగిలిన వాటిని దర్గాలోకి అనుమతించడం లేదు.

## న్యూస్‌రీల్


### వేడుకగా అన్నమాచార్య జయంత్యుత్సవాలు



ప్రవచిస్తున్న విశ్వనాథశర్మ

నెల్లూరు(బృందావనం): ప్రజలను భక్తిభావం వైపు మళ్లించేందుకు ప్రముఖ వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యులు సంకీర్తనల ద్వారా చేసిన కృషి అనన్యసామాన్యమైనదని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతి న్యాయవిభాగ ఆచార్యుడు కుప్పా విశ్వనాథశర్మ పేర్కొన్నారు. అన్నమాచార్య జయంత్యుత్సవాలను నగరంలోని పురమందిరంలో శనివారం నిర్వహించారు. ప్రముఖ సంగీత విద్వాంసురాలు జమ్మలమడక బాలార్క శిష్యబృందం ఆలపించిన సప్తగిరి సంకీర్తనలు అలరించాయి. అనంతరం వెంకటేశ్వరస్వామి వారి ఏకాంతసేవను తిరుపతికి చెందిన అర్చకుడు తనూజ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గోవింద నామస్మరణతో పురమందిరం పులకించింది. శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. గ్రీన్ సిటీ గ్రూప్, హైదరాబాద్ గౌరవాధ్యక్షుడు సుబ్బరాజు, అన్నమాచార్య ఆరాధన సమితి, నెల్లూరు అధ్యక్షుడు సుధాకర్‌రాజు, ఉపాధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి, సమన్వయకర్త హరిబాబు, డాక్టర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

### సోమశిలకు వరద ప్రవాహం



చేజర్ల(సోమశిల): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో సోమశిల జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. వైఎస్సార్ జిల్లా రాజోలు నుంచి 5,025 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. జలాశయంలో ప్రస్తుతం 24.56 టీఎంసీల నీటిమట్టం నమోదైంది. జలాశయం నుంచి 1,860 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

### రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి



ముత్తుకూరు: ముత్తుకూరు మండలం నేలటూరులోని దామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో రెండు యూనిట్ల నుంచే విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్ట్ ఇంజినీర్లు శనివారం తెలిపారు. ఒకటో యూనిట్లో 420, రెండో యూనిట్లో 415 మెగావాట్ల చొప్పున విద్యుదుత్పత్తి జరుగుతోందని చెప్పారు. సాంకేతిక కారణాలతో మూడో యూనిట్‌లో ఉత్పత్తిని నిలిపేశామన్నారు.

# జీజీహెచ్‌కు సేవ చేయడం అదృష్టం

- వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు
- ప్రారంభించిన ఎంపీలు వేమిరెడ్డి, ఆదాల

నెల్లూరు(బారకాసు): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్)కి సేవ చేసే భాగ్యం తనకు కలగడాన్ని అదృష్టంగా భావిస్తున్నానని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీజీహెచ్‌లోని ఓపీ, ఐపీ, డయాలసిస్ వార్డుల్లో ఏర్పాటు చేసిన మూడు ఆర్వో ప్లాంట్లను ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. జీజీహెచ్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. జిల్లాలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్న గ్రామాలను గుర్తించి వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 110 ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశామని వెల్లడించారు. కోవిడ్ సమయంలో జిల్లా వ్యాప్తంగా మూడు లక్షల శానిటైజర్లు, 10 లీటర్ల ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను వంద పంపిణీ చేశామని చెప్పారు. జీజీహెచ్‌లో ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు తమ వంతు సాయాన్ని అందించాలని కలెక్టర్ హరినారాయణన్ గత నెల్లో కోరారని, దీంతో ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ ప్లాంట్ల నిర్వహణను తమ ఫౌండేషనే చూసుకుంటుందని వెల్లడించారు



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీలు వేమిరెడ్డి, ఆదాల

### తాగునీరిచ్చిన దాత వీపీఆర్

మెట్ట ప్రాంతాలైన ఆత్మకూరు, ఉదయగిరికి మంచినీటిని అందించిన దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. జీజీహెచ్‌లో మూడు ఆర్వో ప్లాంట్లను వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. వీపీఆర్ మృదుస్వభావి, దానగుణం కలిగిన వ్యక్తి అని కొనియాడారు. ప్రజల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో ఎంపీలు వేమిరెడ్డి, ఆదాల ఎప్పటికప్పుడు మాట్లాడుతూ తమ వంతు సహాయ సహకారాలను అందిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, చిరంజీవిరెడ్డి, మల్లు సుధాకర్‌రెడ్డి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ లక్ష్మీసునంద, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్, ప్రభుత్వ వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ జమున, ఏఓ కళారాణి, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా మహాయజ్ఞం



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న కోటి కుంకుమార్చనలో భాగంగా మహాయజ్ఞాన్ని శాస్త్రోక్తంగా శనివారం జరిపారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు పూజలు చేశారు. అ నంతరం స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి ఆలయ ఆవరణలోని మండపంపై కొలువుదీర్చారు. మహాహోమగుండం వద్ద పూజలు నిర్వహించారు.

- కోటి కుంకుమార్చన అనంతరం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించి ఆలయ ఆవరణలో మహాయజ్ఞాన్ని జరిపారు. అనంతరం చేపట్టిన పూర్ణాహుతిలో వేమిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. తొలుత ఎంపీ వేమిరెడ్డి పూర్ణాహుతి ద్రవ్యాలతో ఆలయ చుట్టూ ప్రదక్షిణలు చేసి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మహాయజ్ఞంలో పూర్ణాహుతిని సమర్పించారు. ఉభయకర్తలుగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు, రాజారెడ్డి, పూజిత దంపతులు, మల్లికార్జున్‌నాయుడు దంపతులు, రవీంద్రరెడ్డి దంపతులు, శంకర్‌రెడ్డి దంపతులు వ్యవహరించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, సభ్యులు నందకుమార్, రఘురామయ్య, శివకుమార్, పద్మమ్మ, సుప్రజ, కామేశ్వరి, విమలమ్మ, శశిశేఖర్‌శర్మ పాల్గొన్నారు.

# పథకాలను రద్దు చేస్తామని చెప్పగలరా..?

నెల్లూరు (దర్గామిట్ట): తాము అధికారంలోకి వస్తే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను రద్దు చేస్తానని ప్రజలకు చెప్పగలరానని టీడీపీ అధినేత చంద్రబాబును వైఎస్సార్‌టీయూసీ తిరుపతి, నెల్లూరు, కడప జిల్లాల ఇన్‌చార్జి నారపరెడ్డి రాజారెడ్డి ప్రశ్నించారు. నగరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతోందని కేంద్ర నివేదికలు చెప్తున్నాయని, అయితే ప్రతిపక్షాలు.. కొన్ని పత్రికలు అసత్యాలను ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. చిన్న రాష్ట్రమైనా దేశానికి ఆర్థిక శక్తిని అందించడంలో ఏపీ కీలకంగా మారిందని తెలిపారు. ఎలాంటి అవినీతికి తావు లేకుండా నాలుగేళ్లలో రూ.3.26 లక్షల కోట్ల సంక్షేమాన్ని ప్రజలకు అందించడం చరిత్రలోనే ప్రథమమని తెలిపారు.



మాట్లాడుతున్న రాజారెడ్డి

రాష్ట్రాన్ని చంద్రబాబు అప్పుల కుప్పగా మారిస్తే.. అభివృద్ధి పథంలో జగన్‌మోహన్‌రెడ్డి నడిపిస్తున్నారని కొనియాడారు. అనంతరం రాజారెడ్డిని సత్కరించారు. వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముత్యంగౌడ్, రాష్ట్ర నేత మండ్ల రాజేష్ కుమార్, మెడికల్ విభాగ నేత కిరణ్, రాష్ట్ర కార్యదర్శి కుమార్ పాల్గొన్నారు.

# వారిని ప్రజలు విశ్వసించరు

- ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: టీడీపీ అధినేత చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలో విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ఉద్దేశపూర్వకంగా అర్థరహిత ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పాలనను ఓర్వలేని వారు సీఎంపై ఆరోపణలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని మండిపడ్డారు. గతంలో చంద్రబాబు బూటకపు వాగ్దానాలు చేసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని, ఈసారి అదే తరహాలో వ్యవహరిస్తూ పగటి కలలు కంటున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలోనే వీరికి ప్రజలు గుర్తుకొస్తారానని ప్రశ్నించారు. అధికారంలోకి రాబోమని వీరికి తెలిసినా, మతిభ్రమించే ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డినే మరోసారి ముఖ్యమంత్రిగా ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు.


మాట్లాడుతున్న నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

**రూ.60 లక్షల మంజూరు**

బుచ్చిరెడ్డిపాళెంలోని 15వ వార్డులో సైడ్‌కాలువలను నిర్మించాలని కౌన్సిలర్ అనంతమ్మ కోరగా, నుడా ద్వారా రూ.50 లక్షలను మంజూరు చేశామని తెలిపారు. మరో వారంలో పనులను ప్రారంభించనున్నామని వెల్లడించారు. ఇస్కపాళెం పంచాయతీ పరిధిలోని పల్లాప్రోలు ఎస్సీ కాలనీలో డయేరియా సోకి నలుగురు ఇటీవల మృతి చెందడం బాధాకరమని చెప్పారు. ఆ గ్రామంలో పర్యటించిన సమయంలో 25 ఏళ్ల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను మార్చాలని స్థానికులు కోరారన్నారు. ఈ క్రమంలో కలెక్టర్ నిధుల నుంచి రూ.పది లక్షలను మంజూరు చేశారన్నారు. చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ చైర్‌పర్సన్ లలితారెడ్డి, వైస్ చైర్మన్ షాహుల్, మండల, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, నేతలు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, కోడూరు మధుసూదన్‌రెడ్డి, మోర్ల మురళి పాల్గొన్నారు.

## జీవితంపై విరక్తితో డ్రైవర్ ఆత్మహత్య



నెల్లూరు(క్రైమ్): జీవితంపై విరక్తి చెంది డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అరవిందనగర్‌లోని రైల్వే బ్రిడ్జిపై శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. ఎస్‌ఈబీ – 2లో వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్న మూలాపేటకు చెందిన రియాజ్ (35), సాదియా దంపతులకు మూడేళ్ల బాబు, మూడు నెలల పాప ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో గతంలోనూ ఆయన ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టగా, కుటుంబసభ్యులు గమనించి వారించడంతో విరమించుకున్నారు. ఈ క్రమంలో ఎస్‌ఈబీ – 2 ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్ చేసి తాను చనిపోతున్నానని చెప్పి కాల్ డిస్‌కనెక్ట్ చేశారు. అప్రమత్తమైన ఇన్‌స్పెక్టర్ వారి కుటుంబసభ్యులకు విషయాన్ని తెలియజేశారు. అతని కోసం సిబ్బంది గాలించినా ప్రయోజనం లభించలేదు. ఈ క్రమంలో గూడూరు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై హరిచందన ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# గంజాయి రవాణాపై ఉక్కుపాదం

- కారు, రూ.50 లక్షల విలువజేసే 100 కిలోల స్వాధీనం

కావలి రూరల్: గంజాయిని రవాణా చేస్తూ విక్రయాలు సాగిస్తున్న 17 మందిని ముసునూరు టోల్‌ప్లాజా వద్ద కావలి రూరల్ పోలీసులు శనివారం అరెస్ట్ చేసి సుమారు 100 కిలోలను స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలను డీఎస్పీ వెంకటరమణ వెల్లడించారు. కారులో భారీగా గంజాయిని తరలిస్తున్నారనే సమాచారంతో కావలి రూరల్ సీఐ రాజేష్, ఎస్సై సుమన్ ఆధ్వర్యంలో టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేపట్టామని చెప్పారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి బెంగళూరుకు కారులో గంజాయిని తరలిస్తున్న అబ్దుల్ సాజిద్, అమర్‌నాథ్‌ను పోలీసులు ఎంతో చాకచక్యంగా పట్టుకొని వారి నుంచి 40 కిలోలను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. నిందితుల సమాచారం మేరకు చెన్నాయపాళెం క్రాస్‌రోడ్డు వద్ద వీరి నుంచి కొనుగోలు చేసిన 60 గంజాయి ప్యాకెట్లను పంచుకుంటున్న మరో 15 మందిని అరెస్ట్ చేశారు. అనంతరం వీరి నుంచి 60 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న వెంకటరమణ

# చిన్నారి అపహరణకు యత్నం


- నిందితుడికి దేహశుద్ధి

బిట్రగుంట: బోగోలు పంచాయతీ బేతనీయపేటలో శనివారం మధ్యాహ్నం చిన్నారి కిడ్నాప్ యత్నం తీవ్ర కలకలం సృష్టించింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. బేతనీయపేటకు చెందిన ఐదేళ్ల చిన్నారి తన నివాసానికి సమీపంలోని దుకాణానికి వెళ్లి వస్తుండగా సమీపంలో మాటు వేసిన ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన అపరిచిత వ్యక్తి పాపను అపహరించేందుకు యత్నించాడు. ఒక్కసారిగా పాపను భుజాలపైకెత్తుకొని, నోరు మూసి పరుగులు తీస్తుండగా, స్థానిక మహిళలు గుర్తించారు. వెంటనే అపరిచితుడ్ని అడ్డుకొని పాపను కాపాడి నిందితుడికి దేహశుద్ధి చేశారు. అనుమానాస్పదంగా ఉండటంతో పాటు సరైన వివరాలు చెప్పకపోవడంతో కాళ్లు, చేతులు కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడ్ని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. పాప తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# వైద్య శాఖలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(బారకాసు): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలోని ఎన్‌హెచ్‌ఎం విభాగంలో పలు పోస్టుల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు పీడియాట్రీషియన్ పోస్టులు, ఆత్మకూరులోని ఆస్పత్రిలో టెలిమెడిసిన్ హబ్, డీఈఐసీ సెంటర్, నగరంలోని జీజీహెచ్‌లో రెండు ఎస్పెన్సీయూ, జనరల్ మెడిసిన్ ఉద్యోగ నియామకాలకు గానూ డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఈ నెల 31 నుంచి ఆగస్టు ఐదు వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. నియమితులైన వారికి నెలకు రూ.1.1 లక్షల జీతం లభించనుందని తెలిపారు. spsnellore.ap.gov.in/notice/recruitment నుంచి అప్లికేషన్లను పొందాలని సూచించారు.





## నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



| | |
|---|---|
| బ్రాయిలర్ (లైవ్) | : 130 |
| లేయర్ (లైవ్) | : 88 |
| బ్రాయిలర్ చికెన్ | : 226 |
| బ్రాయిలర్ స్కిన్‌లెస్ | : 250 |
| లేయర్ చికెన్ | : 150 |

## పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)

| | |
|---|---|
| పెద్దవి | : రూ.35 |
| సన్నవి | : రూ.23 |
| పండ్లు | : రూ.7 |





# సండే క్లాసిఫైడ్స్ సాక్షి